# టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన

బస్సులో ఏర్పాటు చేసిన రోబో

## ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ పేరుతో అధునాతన బస్సు

ఖైరతాబాద్, జూన్ 13 : ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్..రోబోటిక్స్..త్రీడి ప్రింటింగ్ తదితర టెక్నాలజీపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎడు ద్వజా సంస్థ శ్రీకారం చుట్టింది. ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ పేరుతో ఇప్పటికే ఓ అధునాతన బస్సును తయారు చేయగా ఈ నెల 10న సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. సాంకేతిక విజ్ఞాన భాండాగారంగా ఉన్న ఈ బస్సులో ఉన్న ప్రత్యేకతలు, విశేషాలను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎడుద్వజా సంస్థ, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీఈవో మధులాశీ బాబు, సీటీవో పవన్ కుమార్ వివరించారు. 18 మంది ఇంజినీరింగ్ విద్యార్థుల ఆలోచన రూపమే 'ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ అని అన్నారు. ఈ వాహనం తయారీకి అమెరికాకు చెందిన జార్జ్ మేషన్ యూనివర్సిటీ ఒక లక్ష డాలర్లు, తిరుపతికి చెందిన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబేటర్) తరపున రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించారని తెలిపారు. ఇందులో ఏఐ, కోడింగ్, ఏఆర్, వీఆర్ జోన్, వెథర్ స్టేషన్, ఏరో స్పేస్ టెక్నాలజీ, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్, ప్రోగ్రామింగ్ జోన్ ఉన్నాయని, త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీతో వస్తువుల రూపకల్పన, చేతి సాయం లేకుండానే పెన్నుతో కాగితంపై రాసే విధానాన్ని రూపొందించామని పేర్కొన్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మ్యాథమెటిక్స్ (స్టెమ్) సూత్రాన్ని అనుసరించి బస్సును రూపొందించామన్నారు. బస్సు మొత్తం అలెక్సా సూచనల ఆధారంగా నడుస్తుందని, విద్యుత్ సరఫరా మొత్తం వాహనంపై అమర్చిన సోలార్ ప్యానెల్‌తో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రసన్న, నాంది వెంచర్స్ కో ఫౌండర్ వికాస్ కాట్రగడ్డ తదితరులు పాల్గొన్నారు.



త్రీడి ప్రింటర్‌కు ఏర్పాటు చేసిన పెన్ను

## అమృతవల్లికి అంతర్జాతీయ అవార్డు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 13: మాతృభాష తెలుగులో రాణిస్తున్న ఎ.వి.ఎస్.డి అమృతవల్లిని మలేషియాకు చెందిన యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్ అండ్ కల్చరల్ సంస్థ అంతర్జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. మన సంస్కృతి సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి తెలుగు ప్రతిభ పరీక్షల్లో అమృతవల్లి వరుసగా ఆరుసార్లు విజేతగా నిలువడంతో పాటు సీబీఎస్ఈ పదో తరగతి తెలుగు సబ్జెక్టులో వంద మార్కులకు గాను 99 మార్కులు సాధించినందుకు గాను అంతర్జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారని మన సంస్కృతి పరీక్షా సంచాలకుడు డాక్టర్ అనిల్‌కుమార్ దివేది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న కౌలాలంపూర్‌లో జరగనున్న అంతర్జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో అమృతవల్లి పురస్కారాన్ని అందుకోనున్నట్లు అనిల్ కుమార్ వెల్లడించారు.

## లా సెట్‌లో గురుకుల విద్యార్థినికి 9వ ర్యాంక్

మల్కాజిగిరి, జూన్ 13: ఐదు సంవత్సరాల లాసెట్‌లో మైనారిటీ గురుకుల విద్యార్థిని అమ్ముతుల్లా వాహీద్ 9వ ర్యాంక్ సాధించి సత్తా చాటింది. గురువారం విడుదల చేసిన లా సెట్ ఫలితాల్లో మౌలాలిలోని సికింద్రాబాద్ గర్ల్స్-1 మైనారిటీ గురుకుల కాలేజీలో చదివిన పలువురు విద్యార్థినులు రిజ్వాన 240, శ్రావణి 439, రబీనా 517, రమ 672 ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కవిత తెలిపారు.

## అక్రమ లేఅవుట్లపై ఫిర్యాదు

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ ) : సాహెబ్‌నగర్ కొండాపూర్‌లో వెస్టరన్ కన్‌స్ట్రక్షన్ (తపోవన్) నిబంధనలు ఉల్లంఘించి లే అవుట్ పనులు చేపడుతున్నారంటూ కార్పొరేటర్లు లచ్చిరెడ్డి నరసింహారెడ్డి, వంగ మధుసూదన్ రెడ్డి ఇతర కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ సిటీ చీఫ్ ప్లానర్ (సీసీపీ) రాజేంద్ర ప్రసాద్ నాయక్ గురువారం కలసి ఫిర్యాదు చేశారు. బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో 65 ఎకరాల భారీ లే అవుట్‌లో నిబంధనలు అతిక్రమించినట్లు పేర్కొన్నారు. అటవీశాఖకు సంబంధించిన భూమిని అప్రోచ్ రోడ్డుగా చూపించి అనుమతి తీసుకున్నారని, కొందరు అధికారులు సహకరిస్తున్నారని వారు ఆరోపించారు.

## గిరిజన అభ్యర్థులకు ఉచిత సివిల్స్ శిక్షణ

సిటీబ్యూరో, జూన్ 13 ( నమస్తే తెలంగాణ ) : సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమయ్యే గిరిజన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు హైదరాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆర్. కోటాజీ గురువారం ఒక ప్రకటనకలో తెలిపారు. రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులను ఆబ్జెక్టివ్, ఆప్టిట్యూడ్ పరీక్షతో ఎంపిక చేస్తామని తెలిపారు. అభ్యర్థి కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షలకు మించకూడదన్నారు. ఈ నెల 30లోపు http://studycircle.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం 6281766534 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌కు నారాయణ విద్యార్థులు ఎంపిక

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): హెచ్‌బీసీఎస్ఈ, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్, ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌నకు నారాయణ విద్యా సంస్థలకు చెందిన 45మంది విద్యార్థులు ఎంపికయ్యారని నారాయణ గ్రూప్ ఎండీ డా.పి.సింధూర నారాయణ, శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

# నిమ్స్‌లో పార్కింగ్ దందా

- ఒక్కో వాహనానికి రూ.2వేలకు పైగా వసూలు
- రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు

నిమ్స్ ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసిన వాహనాలు

ఖైరతాబాద్, జూన్ 13 : నిమ్స్ విస్తరణలో భాగంగా చదును చేసిన ఖాళీ స్థలంలో అక్రమ పార్కింగ్ దందా కొనసాగుతున్నది. వందలాదిగా వాహనాలను పార్కింగ్ చేస్తూ ప్రైవేట్ వెహికిల్ యజమానులు ఈ స్థలాన్ని ఇష్టారాజ్యంగా వినియోగించుకుంటున్నారు. అయితే ఈ వ్యవహారంలో కొందరు పార్కింగ్ ఫీజు రూపంలో లక్షల రూపాయలు దండుకుంటున్నట్లు సమాచారం. ఒక్కో వాహనానికి రూ.2వేలకు పైగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో నిమ్స్ వైద్య సేవలను మరింత విస్తరించేందుకు 2వేల పడకలతో దశాబ్ది బ్లాక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు 32 ఎకరాల 16 గుంటల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలంలో 23,96,542.34 చదరపు అడుగులలో నిర్మించనున్న దశాబ్ది బ్లాక్‌కు అప్పటి ప్రభుత్వం రూ.1,571 కోట్లను మంజూరు చేసింది. నిర్మాణ పనులకు నోడల్ అధికారిగా నిమ్స్ డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి భాస్కర్, మరికొందరు అధికారులను పర్యవేక్షణ కోసం నియమించారు. నిర్మాణ బాధ్యతలను మెగా నిర్మాణ సంస్థకు అప్పగించారు. ఇదిలా ఉండగా, మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా చదును చేసిన ఖాళీ స్థలం అక్రమ పార్కింగ్ దందాకు అడ్డాగా మారింది. ఈ వ్యవహారంలో కొందరు స్థానిక నాయకుల 'హస్తం' ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

### ఆర్నెళ్లుగా దందా...

ఈ ఖాళీ స్థలంలో వందలాదిగా అంబులెన్సులు, పలు ప్రైవేట్ విద్యాసంస్థల వాహనాలు, బస్సులను పార్కింగ్ చేస్తున్నారు. ఆర్నెళ్లుగా ఇక్కడ పార్కింగ్ దందా నడుస్తున్నా నిర్మాణ బాధ్యతలను చూస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ పార్కింగ్ దందా ద్వారా కొందరు నెలకు సుమారు రూ.6లక్షల నుంచి రూ.10లక్షలకు పైగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. రాత్రి యైందంటే చాలు కొందరు ట్రాన్స్‌జెండర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.

### పార్కింగ్‌తో సంబంధం లేదు

డాక్టర్ బీరప్ప, డైరెక్టర్ నిమ్స్

నిమ్స్ ఖాళీ స్థలంలో పార్కింగ్‌లు పెట్టుకునేందుకు నిమ్స్ ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. ఇప్పటికే ఆస్పత్రి స్థలంలో కూల్చివేయకుండా నిలిపివేసిన కూరగాయల మండి, ఇతర వ్యాపారులకు నోటీసులు సైతం జారీ చేశాం. పార్కింగ్ విషయం తమ దృష్టికి వచ్చింది. కొత్త బ్లాక్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులకు ఇప్పటికే చర్యలు తీసుకోవాలని చెప్పాం. వెంటనే ఖాళీ చేయించాలని ఆదేశాలిచ్చాం.

## ఈ-వార్డు డిజిటల్ హెల్త్ సొల్యూషన్ ప్రారంభం

ఈ వార్డు డిజిటల్ హెల్త్ సొల్యూషన్ ప్రోగ్రాం ద్వారా వ్యక్తి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న వైద్యులు

దుండిగల్, జూన్13: మెరుగైన రీతిలో రోగులకు భద్రత, సౌకర్యవంతమైన సంరక్షణను అందించటం కోసం మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఈ-వార్డు-డిజిటల్ హెల్త్ సొల్యూషన్ ప్రోగ్రాంను ఇంటర్నల్ మెడిసిన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ నిత్య, డా.జీజేడీ రావు,డా.ప్రవీణ్,డా.రాకేశ్ ప్రభు,డోజీ సీటీవో సహ వ్యవస్థాపకుడు గౌరవ్ పర్చాని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగుల సంరక్షణకు ఉపయోగపడే సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే నాన్-ఐసీయూ వార్డుల్లో ఉన్న రోగులకు కృత్రిమ మేధ(ఏఐ)ద్వారా రోగుల వైటల్స్‌ను నిరంతరం పర్యవేక్షించేదుకు గాను డోజీ,కాంటాక్ట్‌లెస్ రిమోట్ పేషేంట్ మానిటరింగ్(ఆర్‌పీఎం),ఎర్లీవార్నింగ్ సిస్టం(ఈడబ్ల్యూఎస్) పద్ధతులను వాడనున్నట్లు తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన వసతులను ఏర్పాటు చేస్తున్న నారాయణ మల్లారెడ్డి వైద్యశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డోజీ సీటీవో సహ వ్యవస్థాపకుడు గౌరవ్ పర్చాని తెలిపారు.

## ఆర్గానిక్ ఉత్పత్తులతో ఆరోగ్యం

మాదాపూర్, జూన్ 13: జీవన విధానంలో ఆరోగ్యకరమైన ఆహార నియమాలు పాటించడం ఉత్తమమని బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఫుడ్ ఏ ఫెయిర్ 2024 ప్రదర్శనకు ముఖ్య అతిథిగా గోపీచంద్ విచ్చేసి తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ డైరెక్టర్ అఖిల్ గవార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి ఆర్గానిక్ ఉత్పత్తులు అన్ని విధాల మేలు చేస్తాయని, ఆరోగ్యకరమైన జీవన విధానంలో ఆహార నియమాలు పాటించడం ఉత్తమమని అన్నారు. ఇందులో భాగంగా జొన్న రొట్టెలు, కోల్డ్ ప్రెస్డ్ వంట నూనెలతో పాటు విభిన్న రకాల ఉత్పత్తులు ప్రదర్శనలో కొలువుదీరాయి.

## జోయాలుక్కాస్ షోరూమ్ ప్రారంభం

కొండాపూర్, జూన్ 13 : ప్రపంచ స్థాయి జ్యువెల్లరీ, సాటిలేని వినియోగదారుల సేవలతో అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దబడిన జోయాలుక్కాస్ రెండో షోరూమ్‌ను గురువారం కొండాపూర్‌లో ప్రారంభించారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ థామస్ మాథ్యు, సీవోవో హెన్రీ జార్జ్, రిటైల్ మేనేజర్ రాజేశ్ కృష్ణన్, మార్కెటింగ్ డీజీఎం అనిష్ వర్గీస్, రీజినల్ మేనేజర్ ఆంటో థామస్, సినీ నటి దివి వడ్త్యా తదితరులతో కలిసి రిబ్బన్ కట్ చేశారు. ప్రారంభోత్సవంలో భాగంగా గోల్డ్ డైమండ్స్, సిల్వర్ జ్యువెల్లరీ కోసం అన్ని మజూరీ ఛార్జీలపై 50 శాతం రాయితీని అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఇండో -జపాన్ హబ్‌ను సందర్శించిన జపాన్ రాయబారి హిరోషీ సుజుకీ, ప్రతినిధుల బృందం

## 'ఇండో-జపాన్ హబ్' సందర్శన

కొండాపూర్, జూన్ 13 : భారతదేశం, జపాన్ ఉమ్మడి విలువలను పంచుకుంటున్నాయని, జపాన్ సంస్కృతిని భారత్‌లో ప్రోత్సహించడానికి సహకరిస్తున్నందుకు జపాన్ రాయబారి హిరోషి సుజుకీ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం కొండాపూర్‌లోని ఏషియన్ సన్‌సిటీలో ఉన్న ఇండో -జపాన్ (నారా జపాన్ హబ్) హబ్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకబెనా, బోన్సాయ్, ఒరిగామి, మార్షల్ ఆర్ట్స్, జపనీస్ భాషా తరగతులు ఇండో - జపాన్ హబ్ కేంద్రంగా కొనసాగడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రామభద్ర, నాగనాథ్, మిహోకో నాగై, కోజిహర, నవోకో యుజావా, లక్ష్మి, జయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## గౌతమ్ మోడల్ స్కూల్‌లో పాఠ్యపుస్తకాల గది సీజ్

హిమాయత్‌నగర్,జూన్13: ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర,రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1ని ఉల్లంగిస్తూ హిమాయత్‌నగర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్ యాజమాన్యం పాఠశాల పేరుతో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను ముద్రించి విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న ఏఐవైఎఫ్ నాయకులు గురువారం స్కూల్ వద్ద ధర్నా చేశారు. సమాచారం అందుకున్న హిమాయత్‌నగర్ మండల డిప్యూటీ విద్యాశాఖ అధికారిణి విజయలక్ష్మి అక్కడి వెళ్లి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, నిల్వ ఉంచిన స్టేషనరీ గదిని సీజ్ చేశారు. ఏఐవైఎఫ్ నగర ఉపాధ్యక్షుడు మాజీద్ అలీఖాన్,నాయకులు కల్యాణ్, విజయ్ పాల్గొన్నారు.

## డిగ్రీ అధ్యాపకుల బదిలీలు చేపట్టండి

విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశంకు వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ బ్రిజేశ్

నేరేడ్‌మెట్, జూన్ 13: డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా ఐదేండ్లు పూర్తిగా పనిచేసిన వారికి బదిలీలు చేపట్టాలని టీజీసీటీఏ కార్యదర్శి డాక్టర్ బ్రిజేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, కళాశాలల విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశంను గురువారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేండ్లుగా బదిలీలు లేక అధ్యాపక బృందం ఎదురుచూస్తుందని విద్యా సంవత్సరంలో కళాశాలలు ప్రారంభానికి ముందే బదిలీలపై నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సంగీ రమేశ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరిలో ప్రతిభ దాగి ఉంటుంది

సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి

పారాస్పోర్ట్స్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, నటి రెజీనా కాసాండ్రా

శేరిలింగంపల్లి, జూన్ 13: ప్రతి ఒక్కరిలో ప్రతిభ దాగి ఉంటుందని అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు రాణించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి సూచించారు. దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా జవహర్ నవోదయ విద్యాలయ సమితి, ఆదిత్య మెహతా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని జేఎన్‌వీ రంగారెడ్డి క్యాంపస్‌లో నిర్వహిస్తున్న పారాస్పోర్ట్స్ ప్రతిభ గుర్తింపు, శిక్షణ శిబిరాన్ని ప్రముఖ నటి రెజీనాతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ పారాస్పోర్ట్స్ ప్రత్యేక శిక్షణ శిబిరం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఆదిత్యా మెహతా ఫౌండేషన్, నవోదయ విద్యాలయ సమితిల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యార్థులకు ఈ అవకాశాలు అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. ప్రముఖ చలనచిత్ర నటి, ఆదిత్యా మెహతా ఫౌండేషన్ ట్రస్టీ రెజీనా కసాండ్రా మాట్లాడుతూ పారా ఒలింపిక్స్‌లో పతకాలు సాధించి దేశం గర్వపడేలా దివ్యాంగులు పారాస్పోర్ట్స్‌లో ప్రతిభ కనభరచాలన్నారు. నవోదయ విద్యాలయ సమితి రీజినల్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ 13 నుంచి 18 వరకు దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయాలకు చెందిన 200 మంది దివ్యాంగ విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొంటారన్నారు. నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లిబర్టీలోని తిరునిలయంలో స్వామివారి ఊరేగింపు

## ఘనంగా టీటీడీ బ్రహ్మోత్సవాలు

హిమాయత్‌నగర్,జూన్13: హిమాయత్‌నగర్, లిబర్టీలోని తిరునిలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి 19వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సకల దేవతలను బ్రహ్మోత్సవాలను ఆహ్వానిస్తూ ధ్వజా రోహణము ఘట్టం వైభవంగా నిర్వహించారు. శేష వాహనంపై పద్మా వతి గోదాదేవి సమేత శ్రీవారి ఊరేగింపు, హనుమంత వాహనం శ్రీవారి ఊరేగింపు జరిగింది. భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని టీటీడీ ఉపకార్యనిర్వహణ అధికారి రమేశ్‌బాబు కోరారు.

## స్వయం ఉపాధికి ట్రాన్స్‌జెండర్స్ అడుగులు వేయాలి

పేపర్ ప్లేట్ మేకింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వ్యాన్ ఓవన్

అడ్డగుట్ట, జూన్ 13 : స్వయం ఉపాధి వైపు ట్రాన్స్‌జెండర్స్ అడుగులు వేయాలని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వ్యాన్ ఓవన్ సూచించారు. గురువారం హస్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదాను ఆంథోని ఆధ్వర్యంలో లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని ట్రాన్స్‌జెండర్స్‌కు పేపర్ ప్లేట్ మేకింగ్ మిషన్‌ను అందజేశారు. ఈ మిషన్‌ను బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వ్యాన్ ఓవన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం హస్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదాను ఆంథోని మాట్లాడుతూ ' సహాయం పొందడం దీనుల హక్కు' అన్న ఏకైక నినాదంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పొలిటికల్ ఎకానమీ అడ్వజర్ నళిని, ట్రాన్స్ కమ్యూనిటీ లీడర్ వైజయంతి, తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ మఠంలో 27 నుంచి 'శౌర్య' క్యాంపు

కవాడిగూడ, జూన్ 13: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని దోమలగూడలో గల రామకృష్ణ మఠంలో ఈ నెల 27 నుంచి యువతకు 'శౌర్య' పేరిట క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో 18 నుంచి 35 ఏండ్ల మధ్య వయస్సు గల వారు అర్హులని యువకులకు రెసిడెన్షియల్ క్యాంప్ ఉంటుందని వెల్లడించారు. క్యాంపునకు హాజరయ్యే యువత తెల్లటి దుస్తులు ధరించాలన్నారు. వివరాలకు 9177232696 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

## ఆర్థిక అక్షరాస్యత పెంపొందించాలి

కీసర సీఎఫ్ఎల్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్బీఐ ఏజీఎం గోమతి

కీసర, జూన్ 13: ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు సీఎఫ్ఎల్ (సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ) కేంద్రాలు కృషి చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం గోమతి సూచించారు. గురువారం కీసర మండల కేంద్రంలోని ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులతో కలిసి సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, బీమా ప్రయోజన పథకాలు బ్యాంకుల ద్వారా ప్రజలు లబ్ధి పొందేలా సీఎఫ్ఎల్ కేంద్రాలు పనిచేయాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యతపై సంపూర్ణ అవగాహన కల్పిస్తున్న ఎస్ఎస్‌టీ ఎన్జీవో సంస్థల సేవలు అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్షయోజన, అటల్ యోజన పథకం, జీవన జ్యోతి పథకాలను వినియోగించుకోవాలన్నారు. సుకన్య యోజన కింద బ్యాంకుల్లో ఖాతాలను ప్రారంభించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ లీడ్ బ్యాంక్ అధికారులు సతీశ్‌కుమార్, లక్ష్మీకాంత్, ఎస్ఎస్‌టీ డిస్ట్రిక్ కోఆపరేటివ్ ఆర్డినేటర్ అంభిక, కీసర సీఎఫ్ఎల్ సభ్యులు విశ్వనాథ్, భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఏడు రంగుల జెండా పుస్తకావిష్కరణ

ఏడు రంగుల జెండా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి,జూన్13: తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అమరవాది ఫౌండేషన్ సాహిత్య, సాంస్కృతిక సంస్థ నిర్వహణలో గురువారం రవీంద్రభారతిలోని సమావేశం మందిరంలో రచయిత్రి డా. అమరవాది నీరజ రచించిన బాలల కథలు 'ఏడు రంగుల జెండా' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దక్కన్ లాండ్ చైర్మన్, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్, విశిష్ట అతిథిగా జుర్రు చెన్నయ్య విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరవాది హైమావతి, డా.ఏసీఎంఎల్ ప్రసాద్ సాహిత్య పురస్కారం ఆచార్య సి. మృణాళికి, డా.ఎస్ఎంఎల్ ప్రసాద్ హైమావతి బాల సాహిత్య పురస్కారం గరిపెల్లి అశోక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో .డా.పత్తిపాక మోహన్ సభా అధ్యక్షత వహించిన కార్యక్రమానికి చొక్కాపు వెంకటరమణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.ఎన్.బాలాచారి ,సాహితీవేత్త ప్రొఫెసర్ భుజంగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.